ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 3 | సంచిక: 352 | పేజీలు: 6 | వెల: రూ.3/- | బుధవారం 1 ఏప్రిల్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# త్వరలోనే ఆదిలాబాద్‌కు విమానాశ్రయం: రేవంత్ రెడ్డి

## ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు కూడా వేదికలపై మాట్లాడే అవకాశం కల్పిస్తున్నామన్న రేవంత్

## ఆదిలాబాద్ జిల్లాలో అతిపెద్ద పారిశ్రామికవాడను ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడి

## జిల్లాలో త్వరలో యూనివర్శిటీ నిర్మిస్తామన్న సీఎం



**హైదరాబాద్, ఏప్రిల్ 6 (ప్రభాత ఉదయం)**

ఎన్నికలకు ముందు పీపుల్స్ మార్చ్ పేరుతో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్ర పిప్రి నుంచే మొదలయిందని... ఇక్కడి ప్రజలు ఇచ్చిన ధైర్యంతోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పాదయాత్రకు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా పిప్రిలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిపై ఆయన వరాల జల్లు కురిపించారు. గత ప్రభుత్వంలో ప్రతిపక్షాలను నిర్బంధించే సంస్కృతి ఉండేదని, కానీ తమ 'ప్రజాపాలన'లో ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు కూడా వేదికలపై మాట్లాడే అవకాశం కల్పిస్తున్నామని సీఎం తెలిపారు. పార్టీలకు అతీతంగా, తమ ఎమ్మెల్యేలు లేని నియోజకవర్గాల్లో కూడా నిధులు కేటాయిస్తూ అభివృద్ధి చేస్తున్నామని స్పష్టం చేశారు. త్వరలోనే ఆదిలాబాద్‌కు విమానాశ్రయం రాబోతోందని, వీలైతే జూన్ 2వ తేదీన దీనికి శిలాఫలకం వేస్తామని ప్రకటించారు. వేలాది ఎకరాల్లో దేశంలోనే అతిపెద్ద పారిశ్రామికవాడను ఇక్కడ ఏర్పాటు చేయబోతున్నామని, దీని ద్వారా స్థానిక యువతకు భారీగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. తమ్మిడిహెట్టి నుంచి ప్రాణహిత ప్రాజెక్టును ..మిగతా 2లో





## తెలంగాణ ప్రభుత్వంపై
# విజయన్ విమర్శలు

## కేరళ సిఎంతో చర్చకు సిద్ధమని రేవంత్ సవాల్

## పినరయి విమర్శలపై సీఎం రేవంత్ సుదీర్ఘ లేఖ

**హైదరాబాద్, ఏప్రిల్ 6 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ అభివృద్ధిపై చర్చకు సిద్ధమని కేరళ సిఎం పినరయ్ విజయన్‌కు సిఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. తెలంగాణ ప్రభుత్వంపై కేరళం సీఎం పినరయి విజయన్ విమర్శలపై సీఎం రేవంత్ రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో స్పందించారు. తెలంగాణ అభివృద్ధిపై మీతో చర్చకు తాను సిద్ధమని కేరళం సీఎం పినరయి విజయన్‌కి సీఎం రేవంత్ స్పష్టం చేశారు. ఏప్రిల్ 7వ తేదీన కేరళ రాజధాని తిరువనంతపురంలో ముఖాముఖి చర్చకు సిద్ధమని పినరయి విజయన్‌కు సీఎం రేవంత్ సవాల్ విసిరారు. తెలంగాణలోని పాత డేటాతో సీఎం విజయన్ విమర్శలు చేశారని వివరించారు. 2023 డిసెంబర్ నాటికే ఆ పాత డేటా శకం ముగిసిందన్నారు. తెలంగాణ వృద్ధి రేటు టాప్‌లో ఉందని వివరించారు. 2024-25లో తెలంగాణ జీఎస్‌డీపీ 10.1 శాతం వృద్ధి సాధించిందని తెలిపారు. పెద్ద రాష్ట్రాల్లో తెలంగాణ నంబర్ వన్ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతు సంక్షేమమే ధ్యేయంగా రూ.2 లక్షల వరకు రుణ మాఫీ చేశామని చెప్పారు. అలాగే 25.36 లక్షల మంది రైతులకు లబ్ది చేకూర్చామని తెలంగాణ సీఎం సోదాహరణగా వివరించారు. గడచిన 28 నెలల్లో 67,763 ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు పూర్తి చేశామని గణాంకాలతో సహా వివరించారు. కేరళంలో బ్రెయిన్ డ్రైన్ పెరిగిపోయిందంటూ సీఎం రేవంత్ ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేశారు. అదే విధంగా ఆ రాష్ట్రంలోని పారిశ్రామిక వృద్ధి సైతం కుంటుపడిందని ..మిగతా 2లో

# బాసరలో అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన

### కుటుంబ సభ్యులతో అమ్మవారిని దర్శించుకున్న ముఖ్యమంత్రి

### సీఎం మనవడికి అక్షరాభ్యాసం చేయించిన ఆలయ ప్రధాన అర్చకుడు

**హైదరాబాద్, ఏప్రిల్ 6 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాసర సరస్వతి అమ్మవారి క్షేత్రంలో తన మనవడు రియాన్ష్ (రుద్రదేవ్)కు అక్షరాభ్యాసం చేయించారు. ముఖ్యమంత్రి ఈరోజు బాసరలో పర్యటించి ఆలయ అభివృద్ధి పనులకోసం భూమిపూజ చేశారు. కుటుంబంతో సహా ముఖ్యమంత్రి అమ్మవారిని దర్శించుకున్నారు. వేదపండితులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం సీఎం తన మనవడికి అక్షరాభ్యాసం ..మిగతా 2లో





## ఢిల్లీ అసెంబ్లీ వద్ద
# భద్రతా వైఫల్యం

### సెక్యూరిటీని ఛేదించుకుని దూసుకు వచ్చిన కారు

### కారును స్వాధీనం చేసుకుని, డ్రైవర్ అరెస్ట్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 6 (ప్రభాత ఉదయం)**

ఢిల్లీ అసెంబ్లీ వద్ద సోమవారంనాడు కీలకమైన భద్రతా వైఫల్యం చోటుచేసుకుంది. సెక్యూరిటీని ఛేదించుకుని ఓ కారు దూసుకు వచ్చింది. ఉత్తరప్రదేశ్ రిజిస్ట్రేషన్‌తో ఉన్న ఒక వాహనం బలవంతంగా అసెంబ్లీ ఆవరణలోకి ..మిగతా 2లో

# జమిలి, ఉమ్మడి పౌరస్మృతి అమలు దిశగా కీలక అడుగులు

## పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేళ ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 6 (ప్రభాత ఉదయం)**

భారతీయ జనతా పార్టీ కీలక ఎజెండాలైన ఉమ్మడి పౌర స్మృతి, ఒకే దేశం, ఒకే ఎన్నికలను అమలు చేసే దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దీనిపై చర్చోపచర్చలు జరుగుతున్నాయని, సానుకూల పురోగతి కూడా కనిపిస్తోందని పేర్కొన్నారు. భాజపా 47 వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన వర్చువల్‌గా పాల్గొని మాట్లాడారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ల అంశాన్ని 1994లోనే భారతీయ జనతా పార్టీ లేవనెత్తిందని ప్రధాని మోదీ గుర్తు చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి కట్టుబడి ఉందని తెలిపారు. 2029లో జరిగే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు జరిగే ఎన్నికల్లో ఈ రిజర్వేషన్లు అమలు అయ్యేలా చూస్తామని మోదీ హామీ ఇచ్చారు. కాంగ్రెస్ హయాంలో ఎమర్జెన్సీ, ప్రతిపక్షాలపై దాడులు వంటి ఎన్నో అణచివేతలను భాజపా కార్యకర్తలు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉత్సాహపరిచేలా పలు అంశాలను పేర్కొన్నారు. మన కార్యక్రమం చురుగ్గా ముందుకెళుతోంది. ఉమ్మడి ..మిగతా 2లో

# థార్ ఎడారిలో ముడిచమురు ఉత్పత్తి పెంపు

### పశ్చిమాసియా యుద్ధ సంక్షోభం... భారత ప్రభుత్వం కీలక నిర్ణయం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 6 (ప్రభాత ఉదయం)**

అమెరికా-ఇరాన్ యుద్ధ సమయం వల్ల చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసేసింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం ఏర్పడింది. పాకిస్తాన్, బంగ్లాదేశ్ వంటి దేశాలు పెట్రోల్, డీజిల్ కోసం అల్లాడుతున్నాయి. మన దేశంపై పెద్దగా ప్రభావం లేకున్నా, దీర్ఘకాలం ఈ యుద్ధం ఇలాగే కొనసాగితే మాత్రం భారత్ కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిందే. ఈ నేపథ్యంలోనే భారత్ తన 'థార్' ప్రణాళికను అమలు చేస్తోంది. థార్ ఎడారి ప్రాంతంలో ఉన్న చమురు క్షేత్రాల నుంచి ముడి చమురు ఉత్పత్తిని పెంచింది. రికార్డ్ స్థాయిలో 1202 బ్యారెళ్ల ముడి చమురును జోధ్ పూర్ ఆయిల్ ఫీల్డ్స్ నుంచి ఉత్పత్తి చేస్తోంది. గతేడాది ఇక్కడి నుంచి రోజుకు 705 బ్యారెళ్ల ఉత్పత్తి మాత్రమే జరిగేది. ఈ సంక్షోభం నేపథ్యంలో గతేడాది కన్నా 70 శాతం అధిక చమురు ఉత్పత్తిని పెంచింది. ఆయిల్ ఇండియా, జైసల్మేర్‌లోని బఘేవాలా చమురు క్షేత్రం నుండి ముడి చమురును ట్యాంకర్ల ద్వారా గుజరాత్‌లోని మెహసానాలో ఉన్న ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ ప్లాంట్లకు రవాణా చేస్తుంది. అక్కడి నుండి, ఆ ముడి చమురును పైప్‌లైన్ ద్వారా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ నిర్వహిస్తున్న కోయాలి రిగ్÷నైరీకి రవాణా చేస్తారు. 2025-26 ఆర్థిక సంవత్సరం ఆయిల్ ఇండియా తన రాజస్థాన్ ఫీల్డ్ నుంచి 43,773 మెట్రిక్ టన్నుల ముడి చమురును ఉత్పత్తి చేసింది. ఈ ఏడాది 32,787




## ఓటర్ జాబితా
# అప్‌డేట్‌కు గడువు

### సర్ ప్రక్రియపై సుప్రీం ఆదేశం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 6 (ప్రభాత ఉదయం)**

పశ్చిమ బెంగాల్ ఓటరు లిస్ట్ అప్‌డేట్‌కు సుప్రీం కోర్టు ఒకరోజు గడువు విధించింది. రాష్ట్రంలో నిర్వహించిన ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను పునఃపరిశీలించాలని ప్రత్యేక విస్తృత పునర్విచారణ ట్రైబ్యునల్స్‌ను ఆదేశించింది. ఓటరు లిస్ట్ నుంచి పేర్లను తొలగించడానికి న్యాయాధికారులు ఇచ్చిన కారణాలతో సహా మొత్తం పత్రాలను పరిశీలించి, నిష్పక్షపాతంగా విచారణ జరపాలని సూచించింది. ఓటరు జాబితాలో పేర్ల తొలగింపునకు వ్యతిరేకంగా దాఖలైన అప్పీళ్లను నిర్ణయించేందుకు ట్రైబ్యునళ్లు అనుసరించాల్సిన విధానాలను సూచించేందుకు.. ముగ్గురు మాజీ న్యాయమూర్తులతో ఒక ప్యానల్ ఏర్పాటు చేయాలని కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సుప్రీంఆదేశించింది. ట్రైబ్యునల్స్ ..మిగతా 2లో



# లాకప్ డెత్ కేసులో మధురై కోర్టు సంచలన తీర్పు

### 9మంది పోలీసులకు మధురై కోర్టు ఉరిశిక్ష ఖరారు

**చెన్నై, ఏప్రిల్ 6 (ప్రభాత ఉదయం)**

లాకప్ డెత్ కేసులో మధురై కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. బాధ్యులైన 9మంది పోలీసుకలు ఉరిశిక్ష విధిస్తూ తీర్పుని ఇచ్చింది. తమిళనాడులోని తూతుకుడి జిల్లా సాతాన్‌కుళంకు చెందిన తండ్రీ కుమారుల ..మిగతా 2లో



# త్వరలోనే ఆదిలాబాద్‌కు విమానాశ్రయం: రేవంత్ రెడ్డి

**మొదటి పేజీ తరువాయి...**


తిరిగి ప్రారంభిస్తామని, ఇందుకు సంబంధించి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సర్వేలు జరుగుతున్నాయని తెలిపారు. జిల్లాలో త్వరలోనే యూనివర్సిటీని నిర్మిస్తామని, అలాగే బాసర క్షేత్రాన్ని దేశంలోనే గొప్పగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం ఇప్పటివరకు రూ. 10 వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు పథకం వేగంగా కొనసాగుతోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం 2027 మార్చి వరకు జిల్లాల సరిహద్దు మార్పులకు అవకాశం లేదని, ఆ తర్వాత జ్యుడీషియల్ కమిషన్ వేసి బోథ్ రెవెన్యూ డివిజన్ వంటి డిమాండ్లను పరిష్కరిస్తామని చెప్పారు.



# బాసరలో అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన

**మొదటి పేజీ తరువాయి...**

చేయించారు. బాసర ఆలయ ప్రధాన అర్చకుడు సంజీవ్ మహారాజ్... రియాన్ష్ కు పలక బలపంతో అక్షరాభ్యాసం చేయించారు. సీఎం రేవంత్ రెడ్డి దంపతులు, వారి కుమార్తె నైమిశా రెడ్డి దంపతులతో పాటు మంత్రులు కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా, తన మనవడికి తల్లిదండ్రులు రియాన్ష్ అని పేరు పెట్టగా, తాను మాత్రం రుద్రదేవ్ అని పిలుచుకుంటానని ఒక సందర్భంలో ముఖ్యమంత్రి చెప్పారు.



# రాష్ట్రపతి వద్దకు అమరావతి బిల్లు

## పరిశీలన అనంతరం సంతకం చేసే అవకాశం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 6(ప్రభాత ఉదయం):**

రాజధాని అమరావతికి శాశ్వత చట్టబద్ధత కల్పించే దిశగా కీలక ముందడుగు పడింది. పార్లమెంట్ ఉభయ సభల ఆమోదం పొందిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్ట సవరణ బిల్లు-2026.. సోమవారం రాష్ట్రపతి భవన్‌కు చేరుకుంది. లోక్ సభ సచివాలయం ఈ బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం పంపింది. పరిశీలన, న్యాయ నిపుణులతో సంప్రదింపుల అనంతరం రాష్ట్రపతి ఆమోదం తెలపనున్నారు. రాష్ట్రపతి ఆమోదం అనంతరం ఇది చట్టరూపం దాల్చనుంది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్ట సవరణ 2026 బిల్లుకు పార్లమెంట్ ఇటీవల ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. సుమారు ఐదు గంటల పాటు లోక్‌సభ, రాజ్యసభల్లో బిల్లుపై చర్చలు జరిగాయి. ఎలాంటి సవరణలు లేకుండానే బిల్లుకు ఉభయ సభలు ఆమోదం తెలిపాయి. ఉభయ సభల ఆమోదం తర్వాత లోక్‌సభ సచివాలయం ఈ బిల్లును రాష్ట్రపతి వద్దకు పంపింది. ఇవాళ రాష్ట్రపతి ఆమోద ముద్ర వేసే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం ఈ బిల్లు రాష్ట్రపతి పరిశీలనలో ఉంది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం న్యాయనిపుణులతో సంప్రదింపులు జరిపిన అనంతరం రాష్ట్రపతి సంతకం చేయనున్నారు. రాష్ట్రపతి ఆమోదం తర్వాత హిందీ, ఆంగ్ల భాషల్లో గెజిట్ నోటిఫికేషన్ వెలువడనుంది.

# లాకప్ డెత్ కేసులో మధురై కోర్టు సంచలన తీర్పు

**మొదటి పేజీ తరువాయి...**

లాకప్ డెత్ కేసులో మదురై కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. తొమ్మిది మంది తమిళనాడు పోలీసులకు మరణశిక్ష విధించింది. 2020 జూన్ 19న లాక్‌డౌన్ సమయంలో అనుమతించిన సమయానికి మించి మొబైల్ షాప్ నడిపారన్న ఆరోపణలతో యజమాని జయరాజ్, ఆయన కుమారుడు బెనిక్స్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కస్టడీలో ఉన్న వారిని తీవ్రంగా హింసించడంతో ఇద్దరూ చనిపోయారు. ఈ ఘటనకు పాల్పడిన తొమ్మిది మంది పోలీసులపై ఉన్నతాధికారులు కేసు నమోదు చేశారు. ఈ కేసుపై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ మేరకు తాజాగా తీర్పు వెలువరించింది. కొవిడ్ కారణంగా 2020లో దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించిన విషయం తెలిసిందే. అదే ఏడాది జూన్ 19న లాక్‌డౌన్ సమయంలో అనుమతించిన దానికంటే ఎక్కువ సేపు మొబైల్ షాప్ తెరిచి ఉంచినందుకు స్థానిక వ్యాపారి జయరాజ్, అతడి కుమారుడు బెనిక్స్‌లను పోలీసులు అరెస్టు చేశారు. వారిద్దరినీ సత్తాన్‌కులం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి.. ఆ తర్వాత జ్యుడిషియల్ కస్టడీకి తరలించారు. జూన్ 23న కొన్ని గంటల వ్యవధిలో ఇద్దరూ మరణించారు. పోలీసులు రాత్రంతా వారిని తీవ్రంగా కొట్టి హింసించడం వల్లే వారు చనిపోయారని కుటుంబసభ్యులు ఆరోపించారు. దీంతో ఆ సమయంలో డ్యూటీలో పోలీసులను సీబీఐ అధికారులు అరెస్టు చేసి, దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో తండ్రీ కుమారులపై పోలీసులు మోపిన అభియోగాలు కూడా అబద్ధమని తేలింది. ఈ కేసులో ఒక మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన వాంగ్మూలం కీలకంగా మారింది. తండ్రీకొడుకులపై రాత్రంతా దాడి జరిగిందని.. స్టేషన్‌లోని బల్లలు, లాఠీలపై రక్తపు మరకలు ఉన్నాయని ఆమె వెల్లడించింది. ఈ విషయం బయటకు రాకుండా ఉండేందుకు సీసీటీవీ రికార్డింగ్‌లు ప్రతిరోజూ ఆటోమేటిక్‌గా డిలీట్ అయ్యేలా పోలీసులు సెట్ చేసినట్లు అధికారులు గుర్తించారు. పోలీసులు పెట్టిన హింస వల్లే తండ్రీకుమారులు మరణించినట్లు ధ్రువీకరించారు. నాటి నుంచి ఈ కేసుపై విచారణ కొనసాగుతోంది.

# జమిలి, ఉమ్మడి పౌరస్మృతి అమలు దిశగా కీలక అడుగులు

**మొదటి పేజీ తరువాయి...**

పౌరస్మృతి, జమిలి ఎన్నికలపై తీవ్రంగా చర్చలు జరుగుతున్నాయి. మంచి పురోగతి కనిపిస్తోంది. అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి భాజపా కట్టుబడి ఉంది. బ్రిటీష్ కాలం నాటి చట్టాలను రద్దు చేశాం. కొత్త పార్లమెంట్ భవనాన్ని నిర్మించుకున్నాం. జనరల్ కేటగిరీలో 10 శాతం రిజర్వేషన్లు, ట్రిపుల్ తలాక్ రద్దు, పౌరసత్వ సవరణ చట్టం, అయోధ్యలో రామ మందిర నిర్మాణం వంటివి చేపట్టాం అని ప్రధాని మోదీ అన్నారు. 'ఆర్టికల్ 370 రద్దు అసాధ్యమని చాలా మంది వాదించారని, కానీ దాన్ని చేసి చూపించామని ప్రధాని మోదీ అన్నారు. ఆర్టికల్ 370 రద్దు అసాధ్యమని భావించారని, కానీ రద్దు చేసి చూపించామని అన్నారు. అలాగే, ఎన్డీయే కూటమి కూడా 25 ఏళ్లు పూర్తి చేసుకుందని ప్రధాని మోదీ అన్నారు. ప్రజల కోసం, జాతి ప్రయోజనాల కోసం ఈ కూటమి పనిచేస్తోందన్నారు.

# ఓటర్ జాబితా అప్‌డేట్‌కు గడువు

**మొదటి పేజీ తరువాయి...**

పనితీరుకు సంబంధించిన పరిపాలనాపరమైన అంశాలనూ పర్యవేక్షించాలని సూచించింది. ఓటర్లు ఆన్‌లైన్‌లోనే కాకుండా ఆఫ్‌లైన్‌లోనూ తమ అప్పీళ్లను దాఖలు చేయడానికి వీలుగా రసీదులు జారీ చేయాలని జిల్లా మెజిస్ట్రేట్ కార్యాలయాన్ని ఆదేశించింది. మరోవైపు ఓటర్ల జాబితాలోని పేర్లు తొలగించడం లేదా కొత్త పేర్లను చేర్చడంపై వచ్చే అప్పీళ్లను విచారణ చేయడానికి 19 అప్పీలేట్ ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేసినట్లు సుప్రీం కోర్టుకు ఎన్నికల సంఘం తెలియజేసింది

# బంజారాలకు పార్టీలో తగిన ప్రాధాన్యం

## మాజీ ఐపిఎస్ డిటి నాయక్‌తో కవిత భేటీ

**హైదరాబాద్, ఏప్రిల్ 6(ప్రభాత ఉదయం):**

ఈనెల 25న కొత్త రాజకీయ పార్టీ ప్రకటించబోతున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అందుకు తగినట్లుగా వ్యూహాలు రచిస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ మేరకు ఇటీవల సింగరేణి కార్మికులతో భేటీ అవ్వగా తాజాగా సోమవారం బంజారా నేతలను కలిశారు. రిటైర్డ్ అడిషనల్ డీజీ డీటీ నాయక్ సహా పలువురు బంజారా ప్రముఖులతో కవిత భేటీ అయ్యారు. హైదరాబాద్‌లోని డీటీ నాయక్ నివాసానికి వెళ్లిన కవిత మర్యాద పూర్వకంగా వారితో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా తన కొత్త రాజకీయ పార్టీకి మద్దతు ఇవ్వాలని కవిత వారిని కోరారు. పార్టీ ఏర్పాటు నేపథ్యంలో బంజారా సమాజం కోసం ఏం చేయాలనే దానిపై వారితో కూలంకషంగా ఆమె చర్చించారు. ఆ సామాజిక వర్గానికి ఏం చేయాలో అడిగి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే బంజారాలకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేకపోవడం ఇదే మొదటిసారి అని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఏర్పాటు చేయబోయే పార్టీలో వారికి సముచిత అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు బంజారా ప్రముఖులంతా తాము ఏర్పాటు చేయబోయే పార్టీకి సలహాలు, సూచనలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రత్యక్ష రాజకీయాల్లో ప్రవేశించాలనుకునే వారిని తమ పార్టీలోకి సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు.

# ఢిల్లీ అసెంబ్లీ వద్ద భద్రతా వైఫల్యం

**మొదటి పేజీ తరువాయి...**

అడుగుపెట్టినట్టు అధికారులు తెలిపారు. ఈ ఘటన సంచలనం సృష్టించగా, ఢిల్లీ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, గేట్ నెంబర్ 2 వద్దనున్న ఇనుప బ్యారియన్‌ను ఛేదించుకుంటూ ఒక వాహనం అసెంబ్లీ ఆవరణలోకి అడుగుపెట్టింది. వాహనం డ్రైవరు స్పీకర్ విజేందర్ గుప్తా కార్యాలయం వైపు దూసుకుపోయాడు. కార్యాలయం ముందు ఫ్లవర్ బోకే ఉంచడంతో పాటు స్పీకర్ కారుపై ఇంకు చల్లినట్టు గుర్తించారు. ఘటన అనంతరం వాహనం అక్కడి నుంచి వెళ్లిపోయింది. హైసెక్యూరిటీ జోన్‌లో ఈ ఘటన చోటుచేసుకోవడం భద్రతా ఆందోళనలను మరింత పెంచినట్టు చెబుతున్నారు. ఈ ఘటనపై అప్రమత్తమైన ఢిల్లీ పోలీసులు వెంటనే విచారణ చేపట్టారు. నిందితుడిని అరెస్టు చేసి కారును స్వాధీనం చేసుకున్నారు. కాగా, అసెంబ్లీ ప్రాంగణంలో ఉంచిన పుష్పగుచ్ఛంలో ఎలాంటి బాంబు లేదని పోలీసులు తేల్చారు. ప్రస్తుతం సీసీటీవీ ఫుటేజ్‌ను స్కానింగ్ చేసి వాహనం డ్రైవరు ఈ ఘటనకు పాల్పడడానికి కారణంపై విచారణ జరుపుతున్నారు. ఇటీవల ముగిసిన ఢిల్లీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సమయంలోనూ అసెంబ్లీకి బాంబు బెదిరింపులు వచ్చాయి. తాజా ఘటనతో హైసెక్యూరిటీ జోన్‌లో భద్రతా ఉల్లంఘనలు మరింత అందోళనలను కలిగిస్తున్నాయి.



అవార్డు గ్రహీతను సన్మానం చేసిన ఎమ్మెల్యే


# సమాజ అభివృద్ధి కోసం ఇరుగు సిద్ధులు చేసిన సేవలు ప్రశంసనీయం

## ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

## దళిత రత్న అవార్డు గ్రహీత ఇరుగు సిద్ధులుకు ఎమ్మెల్యే సన్మానం

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 06(ప్రభాత ఉదయం)**

దళిత రత్న అవార్డు గ్రహీత ఇరుగు సిద్ధులు ని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి తన క్యాంపు కార్యాలయం లో సోమవారం శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సమాజ అభివృద్ధి కోసం ఇరుగు సిద్ధులు చేసిన సేవలు ప్రశంసనీయం అని పేర్కొన్నారు. దళితుల అభ్యున్నతి కోసం ఆయన నిరంతరం కృషి చేయడం అందరికీ ఆదర్శమని అన్నారు. ఇరుగు సిద్ధులు దళిత రత్న అవార్డు అందుకోవడం ద్వారా వారి సేవలకు మరింత గుర్తింపు లభించిందని, ఇలాంటి వ్యక్తులను ప్రోత్సహించడం సమాజానికి ఎంతో అవసరమని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో జనగామ పట్టణ బిఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు ఉల్లెంగుల సందీప్, బిఆర్ఎస్ నాయకులు మల్లిగారి రాజు, ముసిపట్ల విజయ్ కుమార్, రావెల రవి స్థానిక నాయకులు,కార్యకర్తలు అభిమానులు పాల్గొని ఇరుగు సిద్ధులు కి శుభాకాంక్షలు తెలిపారు.




# దళిత రత్న అవార్డు అందుకున్న యసారపు కర్ణాకర్

## ఈ అవార్డుతో నా మీద భాధ్యత మరింత పెరిగింది: యాసరపు కర్ణాకర్

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 06(ప్రభాత ఉదయం):**

జనగామ మండలం చౌడారం గ్రామానికి చెందిన యసారపు కర్ణాకర్ కు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాల కమిటీ రాష్ట్ర కో చైర్మన్ డి సుదర్శన్ బాబు కరెన్సీ పై అంబేద్కర్ ఫోటో సాధన సమితి జాతీయ అధ్యక్షులు డాక్టర్ జేరిపోతుల పరుశురామ్ చేతుల మీదుగా అవార్డు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా యాసరపు కర్ణాకర్ మాట్లాడుతూ నేను చేసిన సామాజిక సేవ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆలోచన విధానంతో దళిత బహుజన హక్కుల సాధన కోసం పనిచేస్తున్న నన్ను గుర్తించి అవార్డు ఇవ్వడం నాకు ఎంతో సంతోషంగా ఉంది అన్నారు. ఈ అవార్డు తో నా మీద భాధ్యత మరింత పెరిగిందన్నారు. నన్ను ప్రోత్సహిస్తున్న కరెన్సీ పై అంబేద్కర్ ఫోటో సాధన సమితి జాతీయ సలహాదారు మల్లిగారి రాజు, డాక్టర్ రాజమౌళి, డాక్టర్ సుగుణాకర్ రాజు, చెరుకూరి చంద్రయ్య, నెల్లుట్ల ప్రీతం, కొత్త దీపక్ రెడ్డి, కొమ్ము రాజు, కొండబోయిన రాజు, పబ్బ సతీష్, చెరుకూరి మౌనిక సంపత్, బొట్ల రాజన్ బాబు, బుదారపు రాజేష్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

# తెలంగాణ ప్రభుత్వంపై విజయన్ విమర్శలు

**మొదటి పేజీ తరువాయి...**

తెలిపారు. ప్రముఖ నటుడు మోహన్ లాల్ ఫేమస్ డైలాగ్ 'నీ పో, మోనే విజయన్ అంటూ సీఎం రేవంత్ రెడ్డి వ్యంగ్యంగా అన్నారు. కేరళం అసెంబ్లీ ఎన్నికలు మరికొద్ది రోజుల్లో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తరఫున కేరళంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేరళంలోని పినరయి విజయన్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. దాంతో తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు కేరళ సీఎం సంధించారు. దీంతో కేరళ సీఎం వ్యాఖ్యలకు కౌంటర్‌గా సీఎం రేవంత్ స్పందించారు.

# థార్ ఎడారిలో ముడిచమురు ఉత్పత్తి పెంపు

**మొదటి పేజీ తరువాయి...**

మెట్రిక్ టన్నుల కన్నా ఎక్కువ ఉత్పత్తి చేస్తోంది. థార్ ఎడారిలోని చమురు ఈ సమయంలో కీలకంగా మారుతోంది. బికనేర్-నాగౌర్ సబ్ బేసిన్‌లో ఉన్న బఘేవాలా చమురు క్షేత్రం భారతదేశంలోని కొన్ని చమురు క్షేత్రాల్లో ఒకటి. ఆయిల్ ఇండియా 19 బావులలో సీఎస్ఎస్ కార్యకలాపాలను పూర్తి చేసింది. ఇది గతేడాదితో పోలిస్తే సుమారుగా 72 శాతం పెరుగుదల. 1991లో ఈ ప్రాంతంలో చమురును గుర్తించారు. 200.26 చదరపు కి.మీ విస్తీర్ణంలోని థార్ చమురు క్షేత్రంలో 52 బావులు ఉండగా, 33 పనిచేస్తున్నాయి. ఆయిల్ ఇండియా 2018లో తొలిసారిగా సీఎస్ఎస్ టెక్నాలజీని ప్రారంభించింది. ఈ క్షేత్రం నుంచి భారీ స్థాయిలో వెలికితీతకు వీలవుతుంది.

# చదువు ద్వారానే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు: దేశాల భూపాల్


విద్యార్థులనుదేశించి మాట్లాడుతున్న సమాచార హక్కు చట్టం కమిషనర్ దేశాల భూపాల్



సమావేశంలో మాట్లాడుతున్న సమాచార హక్కు చట్టం కమిషనర్ దేశాల భూపాల్

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 6 (ప్రభాత ఉదయం)**


చదువుకుంటేనే సమాజంలో రాణించగలుగుతామని, గుడ్ లైఫ్ స్కూల్ లో చదువుకుంటున్న విద్యార్థులు ఇష్టంగా చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని తెలం గాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ దేశాల భూపాల్ అన్నారు. బుద్వేల్ కు చెందిన గుంటి శ్యాంసన్ నిర్వహిస్తున్న గుడ్ లైఫ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న గుడ్ లైఫ్ స్కూల్ ను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సింగిల్ పేరేంట్ పిల్లలకు, పేద పిల్లలకు హాస్టల్ తో కూడిన ఉచిత విధ్యను అందిస్తున్న గుడ్ లైఫ్ స్కూల్ కృషి అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు చెప్పే చదువును ఇష్టంగా చదివితే డాక్టర్లుగా, లాయర్లుగా, ఇంజనీర్లు, పోలీసు అధికారులుగా ఎదగవచ్చున్నారు. ఈ సందర్భంగా ఆయన తన చిన్న నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తాను సోషల్ వెల్ఫేర్ హస్టల్లోనే చదువుకున్నాన న్నారు. ఎంతో కష్టపడి చదివాను. లాయర్ 23 సంవత్సరాలు ప్రాక్టీసు చేశాను కాబట్టే నేడు సమాచార హక్కు చట్టం కమిషనర్ ను కాగలిగానని తెలిపారు. తన చదువును చూసిన ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి తనను సమాచార హక్కు చట్టం కమిషనర్ గా నియమి ంచడానికి చొరవ తీసుకున్నారన్నారు. నేడు అనేక మంది పేదలకు సేవ చేసే భాగ్యం లభించిందన్నారు. కార్యక్రమంలో గుడ్ లైఫ్ మినిస్ట్రీస్ డైరెక్టర్ గుంటి శ్యాంసన్, గుడ్ లైఫ్ స్కూల్ ప్రిన్సిపాల్ స్వర్ణలత, రాజేం ద్రనగర్ పాస్టర్స్ పెలోషిప్ గవర్నింగ్ బాడీ సభ్యులు రెవరెండ్ ఏ స్వర్ణకుమార్, ఉపాధ్యాయినీలు, సిబ్బంది పాల్గొన్నారు

## గ్రీవెన్స్ దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత

**అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి....**

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 06(ప్రభాత ఉదయం):**


పిర్యాదులు స్వికరిస్తున్న జిల్లా కలెక్టర్

జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫెరెన్స్ హాల్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆర్జీదారుల సమస్యల గురించి తెలుసుకుంటూ తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా (286) ఆర్జీలను కలెక్టర్ స్వీకరించారు.ప్రజావాణిలో ఫిర్యాదుదారుల నుంచి వచ్చిన వివిధ సమస్యలకు అత్యంత ప్రాధాన్యతను ఇవ్వాలని , అదే విధంగా వచ్చిన దరఖాస్తులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వాటిని వెంటనే పరిష్కరించుటకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు.ఈ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్ షోలోన్ , ఆర్డీఓ (స్టేషన్ఘన్పూర్) వెంకన్న, డీఆర్డీఓ వసంత, వివిధ శాఖల సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాను మర్యాద పూర్వకంగా కలిసిన రాష్ట్ర సమాచార హక్కు చట్టం చీఫ్ కమిషనర్, డాక్టర్ చంద్రశేఖర్, కమిషనర్‌లు

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 6 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్ల ను సోమవారం తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం చీఫ్ కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి , కమిషనర్ లు దేశాల భూపాల్, పీవీ శ్రీనివాస్, మెహసినా ఫర్వీన్ లు మర్యాదపూర్వకంగా కలిశారు. గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా నూతన గవర్నర్ గా బాధ్యతలు చేపట్టాక ఆయనను కలసి సమాచార హక్కు చట్టం ద్వారా చేస్తున్న కార్యక్రమాలను, పరిష్కరిస్తున్న దరఖాస్తుల గురించి వివరించారు.

## ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలి

**పరీక్షలు జరిగే ప్రదేశాలలో ఆ సమయానికి (144) సెక్షన్ అమలు**

**జిల్లాలో మొత్తం (13) పరీక్ష కేంద్రాల ఏర్పాటు**

**ఓపెన్ స్కూల్ పది పరీక్షలకు (833), ఇంటర్ పరీక్షలకు (2041) తో కలిపి మొత్తం (2874) మంది విద్యార్థుల హాజరు**

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 06 (ప్రభాత ఉదయం):**

జిల్లాలో ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు.సోమవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో డీసీపీ రాజ మహేంద్ర నాయక్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 20 నుంచి 27 వరకు జరిగే ఓపెన్ స్కూల్ పది పరీక్షలకు (4) పరీక్షా కేంద్రాల్లో (833) మంది విద్యార్థులు, ఇంటర్ పరీక్షలకు (9) పరీక్షా కేంద్రాల్లో (2041) మందితో కలిపి మొత్తం (13) పరీక్ష కేంద్రాల్లో


సమీక్షా చేస్తున్న జిల్లా కలెక్టర్

(2874) మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, అలాగే మధ్యాహ్నం 2:30 గంటల నుంచి 5:30 గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. చీఫ్ సూపరింటెండెంట్ లు (13), డిపార్ట్మెంటల్ అధికారులు (13) మందిని నియమించామన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో ఏఎన్ఎంలు ఉంటారని, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాన్ని ఏర్పాటు చేయాలని, రెండు రూట్లలో ఇద్దరు రూట్ అధికారులను కేటాయించాలని వెల్లడించారు.పరీక్ష కేంద్రాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలని, విద్యార్థులకు తాగునీరు, బెంచీలు, బల్లలు, కుర్చీలు, మూత్రశాలల సౌకర్యం వంటి అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. పోలీస్ ఎస్కార్ట్ తో ప్రభుత్వ వాహనంలో నిర్దేశించిన ఆయా రూట్లలో మాత్రమే పరీక్ష పేపర్లను పరీక్ష కేంద్రాలకు తరలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రతి సెంటర్ కు బందోబస్తును పకడ్బందీగా నిర్వహించాలన్నారు. విద్యుత్ సరఫరా నిరంతరాయంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో ప్రాథమిక చికిత్స కిట్ లు, ఔషధాలు, వేసవి దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్ లు సరిపడా అందుబాటులో ఉండాలని, పరీక్ష రాసే విద్యార్థుల గదుల్లో ఎలాంటి మెటీరియల్ లేకుండా తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పేపర్ల తనిఖీ నిర్వహించాలని తెలిపారు. ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునే విధంగా బస్సుల సౌకర్యం కల్పించాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల పని తీరును సరిచూసుకోవాలని తెలిపారు. అలాగే ప్రతి విద్యార్థిని నిశితంగా పరిశీలించిన తర్వాతే పరీక్ష కేంద్రంలోకి అనుమతించాలని పేర్కొన్నారు. అదే విధంగా ఎవరికీ కూడా మొబైల్ ఫోన్లు పరీక్ష కేంద్రాలకు అనుమతి లేదన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, ఎక్కడా కూడా తప్పులు దొర్లకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. అదే విధంగా పరీక్షల ప్రశ్న పత్రాలను, జవాబు పత్రాల నిర్వహణను సమర్థవంతంగా అమలు చేయాలని, పరీక్ష పూర్తయిన తర్వాత సంబంధిత జవాబు పత్రాలను అత్యంత జాగ్రత్తగా పటిష్ట భద్రత నడుమ నిర్దేశిత ప్రాంతాలకు చేరవేయాలని సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో విద్యా శాఖ ఏడీ సత్యనారాయణ మూర్తి, డీఎంహెచ్ఓ మల్లికార్జున రావు, మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, ఆర్టీసీ డీఎం స్వాతి, ఏసీజీఈ రవి కుమార్, ఏపీఓ శ్రీధర్, విద్యుత్, పోస్టల్ శాఖ, వివిధ శాఖల సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్నకు గిట్టుబాటు ధర అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉంది

**ఎమ్మెల్యే యశస్విని రెడ్డి**

**చాకలి ఐలమ్మ మార్కెట్ యార్డులో మొక్కజొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి.**

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 06(ప్రభాత ఉదయం):**

జిల్లా లోని పాలకుర్తి మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ మార్కెట్ యార్డులో తెలంగాణ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో, ఫ్యాక్స్ (ఫాక్స్ ) వారి సహకారంతో ఏర్పాటు చేసిన మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన మొక్కజొన్నకు గిట్టుబాటు ధర అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రైతులు మధ్యవర్తుల చేతిలో నష్టపోకుండా నేరుగా కొనుగోలు కేంద్రాల ద్వారా పంటను విక్రయించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని పేర్కొన్నారు.ముఖ్యంగా పాలకుర్తి


మొక్కజొన్నల కొనుగోలు కేంద్రంను ప్రారంభించిన ఎమ్మెల్యే

మండలంలోని రైతులకు ఈ కొనుగోలు కేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, సమయానికి ధాన్యం కొనుగోలు జరిగేలా అధికారులకు సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. రైతులు తమ పంటను శుభ్రంగా, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా తీసుకురావాలని సూచించారు..వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడం ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని, రైతుల సంక్షేమం కోసం ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయని ఎమ్మెల్యే అన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్, వైస్ చైర్మన్, బ్లాక్, మండల అధ్యక్షులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మాజీ ఎంపీపీలు, వివిధ గ్రామ సర్పంచులు, మార్కెట్ కమిటీ సభ్యులు, వ్యవసాయ శాఖ అధికారులు, ఫ్యాక్స్ ప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కొనుగోలు కేంద్రం ప్రారంభంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలిపారు..


రాజేంద్రనగర్ లో విశ్రాంత ఉద్యోగుల తో సమావేశమైన టీఎన్ జీఓస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ ఎం హుస్సేనీ ముజీబ్

## విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి: ఎస్ఎం హుస్సేనీ ముజీబ్

**బుద్వేల్, ఏప్రిల్ 6 (ప్రభాత ఉదయం)**

రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల తో పాటు విశ్వవిద్యాలయాలలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీఎన్ఆవోస్ కేంద్ర సంఘం నిరంతరం కృషి చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ ఎం హుస్సేనీ ముజిబ్ అన్నారు. సోమవారం ఆయన రాజేంద్రనగర్ తాలూకా విశ్రాంత ఉద్యోగులతో సమావేశమైనారు. విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన అన్ని సౌకర్యాలను ఇప్పిస్తామన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ తాలుకా ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ ఎం శ్రీనివాస్ యాదవ్, కన్వీనర్ ఎస్ యాదయ్య ముదిరాజ్, ఎస్ జయరాం, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు జి నాగయ్య, డాక్టర్ వి శ్రీరాములు, కనకమామిడి జంగయ్య, ఎం ఎ నయీమ్, ని సూర్యప్రకాశ్ , మల్లేష్, రామచందర్, బాలకృష్ణ, రవీందర్ గౌడ్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.




ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో బాగంగా రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణీ డాక్టర్ లలితాదేవి ఆధ్వర్యంలో సోమవారం మొయినాబాద్ బాస్కర మెడికల్ కాలేజీ వద్ద ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్యమే మహా భాగ్యమని సూచిస్తు ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖ ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రచారం కల్పించారు.

\- బుద్వేల్, ప్రభాత ఉదయం


గగన్ పహాడ్ లో బీజేపీ జెండా ఎగురవేస్తున్న ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్


బీజేపీ కార్యాలయం వద్ద పార్టీ జెండా ఎగురవేస్తున్న ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి

## బీజేపీకి ప్రజలలో పెరుగుతున్న ఆదరణ

**బుద్వేల్, ఏప్రిల్ 6 (ప్రభాత ఉదయం)**

భారత దేశాన్ని ప్రపంచదేశాలలో అగ్రగామి దేశంగా తీర్చుతున్న ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వం వహిస్తున్న బీజేపీ పార్టీని ప్రజలు ఆదరిస్తున్నారని ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ అన్నారు. మైలార్ దేవుపల్లి డివిజన్ -1, డివిజన్ - 2 అధ్యక్షులు గోద పాండు యాదవ్, సూరెడ్డి వినయ్ రెడ్డి ల ఆధ్వర్యంలో కాటేదాన్, మైలార్దేవుపల్లి డివిజన్లలో సోమవారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సం దర్భంగా రెండు డివిజన్లలో పలు చోట్ల బీజేపీ జెండాలను ఎగురవేశారు. పార్టీని ప్రజల లోకి తీసుకువెళ్లడానికి నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలన్నారు. పనిచేసే నాయకులకు, కార్యకర లకు పార్టీ గుర్తింపు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి , రం గారెడ్డి జిల్లా కార్యదర్శి పొన్నమోని మల్లేశ్ యాదవ్, జోగి రవి, ఎన్ మల్లారెడ్డి, అడికె రాజు, బొమ్మరాజు నర్సింహ్మా, సేడెం వెంకటరమణ గుప్తా, షాబాద్ విజయ్ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా మాజీ ఎమ్మెల్యే డికె.భరత సింహ్మా రెడ్డి జన్మదిన వేడుకలు

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 6 ( ప్రభాత ఉదయం)**

గద్వాల మాజీ ఎమ్మెల్యే డికె భరతసింహ్మా రెడ్డి జన్మదిన వేడులకు సోమవారం గద్వాలలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కేటిదొడ్డి బీజేపీ యువ నాయకులు అశోక్ ఆధ్వర్యంలో గద్వాల పట్టణంలోని రాఘవేంద్ర కాలనీ లోని గల అంధుల పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం, అన్నదానం ఏర్పాటు చేశారు. ముందుగా అంధుల పాఠశాలలో డికే భరతసింహ్మారెడ్డి జన్మదిన సందర్భంగా కేక్ కటింగ్ చేసి విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, తదితరులు హాజరయ్యారు.

# ఇస్నాపూర్ గీతాంజలి రోబోటిక్ పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవం







**పటాన్ చెరు, ఏప్రిల్ 6 ( ప్రభాత ఉదయం):**

ఇస్నాపూర్‌లోని గీతాంజలి పాఠశాలలో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించబడింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. గీతాంజలి పాఠశాల నిర్వాహకులు కృష్ణ కిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భరతనాట్యం, చిన్నారుల నృత్యాలు వేదికను సందడిగా మార్చాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో భాగంగా అకాడమిక్స్, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్తమ ప్రదర్శన చేసిన విద్యార్థులకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ గౌరి రేగొండ మాట్లాడుతూ, "విద్యార్థులలో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం పెంపొందించడమే మా లక్ష్యం" అని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రదర్శన చూసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ వార్షికోత్సవం విద్యార్థులలో కళ, సంస్కృతి పట్ల ఆసక్తిని మరింత పెంచుతుందని ముఖ్య అతిథిగా హాజరైన శ్రీ వాగ్దేవి పాఠశాలల నిర్వాహకులు ఎ ఉదయ్ భాస్కర్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఎన్విఆర్ పాఠశాల నిర్వాహకులు వెంకట్రావు, శ్రీ శ్లోక కెవిఆర్ స్కూల్ నిర్వాహకులు కొత్వాల్ కృష్ణారెడ్డి రెడ్డి, స్పందన,వశిష్ట పాఠశాల నిర్వాహకులు లోకనాథం, గ్లోరియస్ పాఠశాల నిర్వాహకులు సింహాచలం, పవిత్ర, శ్రీ వాగ్దేవి పాఠశాలల వైస్ ప్రిన్సిపాల్ గంగిరెడ్డి, సుమతి, కెవిఆర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహిపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు కృష్ణ ఛారి, ప్రియదర్శిని, దివ్య, శిరీష, నాగరాణి, కల్పన, మాధవి, లక్ష్మి, సునీత, మాధవి, కృష్ణ వేణి, సహాయకులు ప్రభాకర్, స్వప్న, దుర్గా, లక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# అధికార పార్టీ నాయకుల అండ... ఆగని దందా

### పట్టపగలే ఇసుక అక్రమ రవాణా

### సమాచారం ఇస్తే... తెలుసుకుంటామంటున్న అధికారులు

### చోద్యం చూస్తున్న రెవెన్యూ పోలీస్ అధికారులు

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 6 ( ప్రభాత ఉదయం)**




జోగులాంబ గద్వాల జిల్లా కేటిదొడ్డి ధరూర్, గట్టు మండలాలోఅక్రమ ఇసుక రవాణా జోరుగా సాగుతుంది. అధికార పార్టీ నాయకుల అండదండలతో పగలు రాత్రి తేడా లేకుండా అక్రమ ఇసుక రవాణ చేస్తుండటం విశేషం. జోగులాంబ గద్వాల జిల్లా సరిహద్దు ప్రాంతమైన కర్ణాటక రాష్ట్రం నుంచి నిత్యం టిప్పర్ లు, ట్రాక్టర్ ల ద్వారా ఇసుక వ్యాపారులు అక్రమ ఇసుక రవాణ చేస్తూ తమ జేబులు నింపుకుంటున్నారు. పట్టపగలే టిప్పర్ లు, ట్రాక్టర్ ల ద్వారా కర్ణాటక నుంచి గద్వాల జిల్లాకు తరలిస్తున్నారు. అక్రమార్కులకు కొందరు అధికార పార్టీ నాయకుల అండదండలతో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నాన్నా ఆరోపణలున్నాయి.కర్ణాటక రాష్ట్రం నుంచి తుంగభద్రనదీ తీరంలో గల ఇసుక రీచ్ ల నుండి టిప్పర్ ల ద్వారా ఇసుకను గద్వాల్ జిల్లాకు అక్రమంగా తరలిస్తున్నారు. గట్టు, కేటిదొడ్డి పోలీస్ స్టేషన్ ల మీదుగా ఈ అక్రమ రవాణ జరుగుతున్న జిల్లా మైనింగ్, పోలీస్ శాఖ ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. గట్టు, కేటిదొడ్డి మండలాలో టిప్పర్ ల ద్వార తెచ్చిన ఇసుకను డంపులుగా నిలువ చేసి అక్కడి నుంచి ట్రాక్టర్ ల ద్వారా తరలిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు అధికార పార్టీకి చెందిన నాయకులు ఈ అక్రమ దందాకు సూత్రధారులనే ఆరోపణలున్నాయి. పోలీస్ అధికారులు తూతూ మంత్రంగా కేసులు నమోదు చేయడంతో ఇసుక వ్యాపారులకు హద్దే లేదంటూ వ్యవహరిస్తున్నారు.రాయచూర్ జిల్లా కృష్ణానదీ తీరం ఉన్న గ్రామాల నుంచి ట్రాక్టర్ ల ద్వారా పట్ట పగలే యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. కేటిదొడ్డి, ధరూర్ మండలాలో పోలీసు, రెవెన్యూ అధికారుల నిఘా పెట్టకపోవడంతోనే కొందరు ఇసుక వ్యాపారులు ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా ఇసుక దందాను కొనసాగిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ధరూర్, కేటిదొడ్డి మండలాలోని పలు గ్రామాలకు అక్రమార్కులు అదును చూసి ఇష్టారాజ్యంగా ట్రాక్టర్ ల ద్వారా ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ఇసుక అక్రమ రవాణ పై పలు వార్తపత్రికలలో వరుస కథనాలు వెల్లవడిన కూడా జిల్లా మైనింగ్ ,పోలీస్ ,రెవెన్యూ అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. అక్రమ ఇసుక రవాణ పై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



### కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక

# నిర్ణయాలను తీసుకుంటుంది

### నియోజకవర్గంలోని పార్కులు, జిమ్‌లు అధ్వానంగా తయారయ్యాయి

### మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కూకట్ పల్లి, ఏప్రిల్ 6 (ప్రభాత ఉదయం)**

గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో అత్యంత సుందరంగా తీర్చిదిద్దిన పార్కులు, జిమ్ములు అద్వాన్యంగా తయారయ్యాయని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సోమవారం కూకట్ పల్లి లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, సెక్రటరీలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో ముందుకు వెళుతూ ఇబ్బందులు పాలు చేస్తుందని, ప్రధానంగా ప్రజలు దోమలు, మంచినీరు, అస్తవ్యస్త రోడ్లతో ఇబ్బందులు పాలవుతున్నారని, దోమల బెడద పెరిగిపోయి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సమస్యలకు సంబంధించి ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులకు ఆ సమస్యను తెలియపరిచి వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని, అలాగే ఏమైనా ఇబ్బంది ఉన్నాయెడల తనను సంప్రదించాలని తెలిపారు. గత పది ఏళ్ల కాలంలో కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేసుకున్నామని, జరిగిన అభివృద్ధి పనులను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని పార్కులు ఓపెన్ జిమ్ములు, అస్తవ్యస్తంగా తయారయ్యాయని, పార్కుల్లో కనీసం మౌలిక సదుపాయాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకని ప్రజల్లో తిరుగుతూ వారి సమస్యలను పరిష్కరించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వంతో పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, సెక్రటరీలు పాల్గొన్నారు.

# రైతుల ఆదాయం పెంచడమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి తుమ్మల





### ఇక్రిశాట్‌లో రెండు రోజుల పాటు యువ రైతులకు శిక్షణా శిబిరం

**పటాన్ చెరు, ఏప్రిల్ 6( ప్రభాత ఉదయం)**

ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ , ఇక్రిశాట్ సంయుక్త ఆధ్వర్యంలో కొడంగల్ నియోజకవర్గానికి చెందిన యువ రైతులకు సాయిల్ హెల్త్ వాలంటీర్లు గా రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం , జిల్లా లోని పటాన్చెరు ఇక్రిశాట్ వ్యవసాయ క్షేత్రంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని ఎనిమిది మండలాలకు చెందిన ప్రతి గ్రామం నుంచి ఒక్కొక్క రైతును ఎంపిక చేసి సాయిల్ హెల్త్ వాలంటీర్‌గా శిక్షణ అందించడం జరుగుతుందని వ్యవసాయ అధికారులు తెలిపారు . ఈ శిక్షణలో భూసార పరీక్షలు, పంటల ఎంపిక, పంటల సరళి మార్పులు, వాతావరణ పరిస్థితుల ప్రభావం, అంతర్ పంటల సాగు, సేంద్రీయ వ్యవసాయం వంటి అంశాలపై నిపుణులు వివరంగా అవగాహన కల్పిస్తున్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైజింగ్ తెలంగాణ 2045 లక్ష్యాలకు అనుగుణంగా వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించడం, అగ్రిటెక్ వినియోగాన్ని ప్రోత్సహించడం, లాభసాటి పంటలు, పంటల విలువ,వృద్ధి ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. రైతుల ప్రధాన ఆస్తి భూమి అని, భూమి ఆరోగ్యంగా ఉంటేనే పంటల దిగుబడులు పెరిగి రైతుల ఆదాయం మెరుగుపడుతుందని పేర్కొ న్నారు. భూమి ఆరోగ్య పరిరక్షణపై రైతుల్లో అవగాహన పెంచడంలో సాయిల్ హెల్త్ వాలంటీర్లు కీలక పాత్ర పోషించాలని సూచించారు. శాస్త్రీయ పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం గ్రామీణ స్థాయికి చేరేలా వాలంటీర్లు కృషి చేయాలని తెలిపారు. రసాయన ఎరువుల అధిక వినియోగం వల్ల భూమి సారవంతత దెబ్బతింటోందని మంత్రి పేర్కొన్నారు .పంటలమార్పిడి ద్వారా భూసారం పెంపొందించవచ్చని సూచించారు. రైతులు బయో ఫెర్టిలైజర్లు, సేంద్రీయ ఎరువులు వినియోగించడం ద్వారా భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పేర్కొన్నారు. అంతర్ పంటల సాగు ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందడమే కాకుండా నేల గుణాత్మకతను కూడా మెరుగుపరచవచ్చని అన్నారు. వ్యవసాయ యాంత్రిక పద్ధతులు, టెక్నాలజీ ఆధారంగా లాభదాయక వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడం ద్వారా రైతులను ఆర్థికంగా బలోపేతం చేయాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ ముఖ్య శాఖ కార్యదర్శి సురేంద్ర మెహన్, ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జానయ్య, కొండా లక్ష్మణ్ హార్టీకల్చరల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ రాజిరెడ్డి, హార్టికల్చర్ శాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్ భాషా, ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్,డిప్యూటీ డైరెక్టర్ జనరల్ స్టాన్ఫోర్డ్ బ్లాడే, జడ్పీ సీఈఓ జానకి రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి శివ ప్రసాద్, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు,వాలంటీర్లు పాల్గొన్నారు.




### అక్రెడిటేషన్ కార్డు దరఖాస్తులకి

# మరో పది రోజుల గడువు

### తొందర పాటుతో తప్పులు చేయొద్దు: టీయూ డబ్ల్యూ జే జిల్లా నేతలు

**పటాన్ చెరు, ఏప్రిల్ 6 ప్రభాత ఉదయం: జర్నలిస్టు**

అక్రెడిటేషన్ కార్డు దరఖాస్తుల కు సంబంధించి సోమవారం వరకే గడువు అనేది పూర్తిగా అవాస్తవం అని టీ యు డబ్ల్యూ జే (ఐ జె యు) రాష్ట ఉపాధ్యక్షుడు ఎం ఎ కే ఫైసల్, జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు రుమాండ్ల అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి అసిఫ్ పేర్కొన్నారు. ఇంకా జిల్లా స్థాయిలో అక్రెడిటేషన్ కమిటీలు ఏర్పాటు కాలేదని వారన్నారు. ఈ కమిటీ ఏర్పాటు కావడానికి సమయం పడుతుందని వారు తెలిపారు. కమిటీ ఏర్పాటు అయిన తర్వాత సమావేశం జరగడానికి మరో రెండు మూడు రోజులు పడుతుంది అని చెప్పారు. రాష్ట్ర స్థాయిలో కూడా కమిటీ సమావేశం జరిగి, కొన్ని నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని వివరించారు. అర్హులైన జర్నలిస్టు మిత్రులందరికీ కార్డులు వచ్చే విధంగా కొన్ని గైడ్ లైన్స్ రాబోతున్నాయని చెప్పారు. ఈ కారణంగా దరఖాస్తు చేసుకునే గడువు ఇంకా ఉన్నదని స్పష్టం చేశారు. జర్నలిస్టు మిత్రులు ఎలాంటి ఆందోళన చెందనవసరం లేదని అన్నారు. అందరూ ఒకటే సారి దరఖాస్తు చేస్తున్నందున,సర్వర్ లో కూడా సమస్యలు వస్తున్నాయని చెప్పారు. ఈ తొందర పాటు లో తప్పులు దొర్లే అవకాశం ఉన్నదని వారు అన్నారు. తప్పులు దొర్లితే దరఖాస్తులు తిరస్కరణకు గురవుతాయని పేర్కొన్నారు. గడువు ఇంకా ఉన్నందున ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని వారు సూచించారు. రెండు సంవత్సరాల తర్వాత కొత్త కార్డులు వస్తున్నాయని, అర్హులందరికీ అక్రెడిటేషన్ కార్డు రావాలని యూనియన్ నేతలు ఆకాంక్షించారు.

**మీడియా అక్రిడిటేషన్ దరఖాస్తుల గడువు ఈనెల 15 వరకు పొడిగింపు**

కొన్ని జిల్లా ల మీడియా అక్రిడిటేషన్ కొత్త కమిటీ ఇంకా ఏర్పాటు కానందున, జర్నలిస్టుల సౌకర్యార్థం అక్రిడిటేషన్ దరఖాస్తుల ఆన్‌లైన్ గడువును ఈనెల 15వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి డిపిఆర్వో ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన జర్నలిస్టులు ఈ పొడిగించిన గడువును సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



# బీజేపీ కార్యకర్తల త్యాగాలు దేశానికి ఆదర్శం

### బీజేపీ యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్

**కూకట్ పల్లి, ఏప్రిల్ 6 (ప్రభాత ఉదయం)**

శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్ భూదేవి హిల్స్ కాలనీలో సోమవారం భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్ పార్టీ జెండాను ఆవిష్కరించి, సీనియర్ నాయకులు, కృషి చేసిన కార్యకర్తలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన కుమార్ యాదవ్, బీజేపీ పార్టీ బలానికి మూలస్తంభం కార్యకర్తలేనని పేర్కొన్నారు."పార్టీ అధికారంలో ఉన్నా లేక పోయినా, ఎన్నో సంవత్సరాలుగా కార్యకర్తలు నిస్వార్థంగా కృషి చేస్తూ పార్టీ ఎదుగుదలకు తమ వంతు సేవలందిస్తున్నారు. వారి త్యాగాలు నిజంగా గొప్పవే," అని ఆయన అన్నారు. దేశం కోసం ధర్మం పట్ల బీజేపీ కార్యకర్తలు ఎప్పుడూ నిబద్ధతతో ఉంటారని, ఎలాంటి పరిస్థితుల్లోనైనా ముందుండి పోరాడి దేశాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తారని ఆయన తెలిపారు. ఈ నిబద్ధతే ప్రజలను బీజేపీ వైపు ఆకర్షిస్తోందని పేర్కొన్నారు. తెలంగాణలో కూడా బీజేపీ రోజు రోజుకి బలపడుతోందని, పార్టీ విస్తరణ వేగంగా కొనసాగుతోందని కుమార్ యాదవ్ విశ్వాసం వ్యక్తం చేశారు. రానున్న హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని, అందులో ఆల్విన్ కాలనీ డివిజన్ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రవీందర్ రావు, నరేందర్ రెడ్డి, రామరాజు, దుర్గ ప్రసాద్, మహేందర్, పున్నా రెడ్డి, ఎత్తరి రమేష్, తిరునగరి శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, రజనీష్, శేఖర్, నరసింహ, శైలేష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.



# ఘనంగా సింగిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి జన్మదిన వేడుకలు

### శుభాకాంక్షలు తెలిపిన టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్

**కూకట్ పల్లి, ఏప్రిల్ 6 (ప్రభాత ఉదయం)**

కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మాజీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి జన్మదిన సందర్భంగా సోమవారం కండ్లకోయ లోని నిమ్మల కన్వెన్షన్ లో ఏర్పాటుచేసిన జన్మదిన కార్యక్రమం లో కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ టిపీసీసీ ఉపాధ్యక్షుడు, జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జీ, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పాల్గొని హరివర్ధన్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి వారికి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశ్యంతో


# సమాచార హక్కు చట్టం వచ్చింది



సమాచార హక్కు సాధన కమిటీ ఆధ్వర్యంలో రవీంద్ర భారతి లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సమాచార హక్కు చట్టం కమిషనర్ దేశాల భూపాల్



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ సభ్యులు వి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న దేశాల భూపాల్



సమాచార హక్కు చట్టం కార్యకర్తలతో కమిషనర్ లు దేశాల భూపాల్, మోహసిన్ ఫర్వీన్ లు

## రాష్ట్ర పోలీస్ కంప్లైంట్ అథారిటీ సభ్యులు వి వెంకటేశ్వర్లు

**రవీంద్ర భారతి, ఏప్రిల్ 6 (ప్రభాత ఉదయం) :**

ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశ్యం తో 2005 లో భారత దేశంలో సమాచార హక్కు చట్టం అమలులోకి తీసుకు వచ్చారని సమాచార హక్కు చట్టం పూర్వ చీఫ్ కమిషనర్, పోలీస్ కంప్లైంట్ అథారిటీ సభ్యులు వి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం నగరంలోని రవీంద్ర భారతిలో సమాచార హక్కు సాధన కమిటీ జాతీయ అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన అవగాహన సమావేశంలో వి . వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. దేశంలోని 140 కోట్ల జనాభాకు జవాబు దారితనంగా ప్రభుత్వ అధికారులు ఉండాల్సిందేనన్నారు. సమాచార హక్కు సాధన కమిటీ చేస్తున్న కృషి అభినందించదగ్గది గా ఉన్నదన్నారు. గ్రామ గ్రామాన సమాచార హక్కు సాధన కమిటీలు ఏర్పాటు కావలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

**సమాచార హక్కు చట్టం బలమైనది : కమీషనర్ దేశాల భూపాల్ :**

సమావేశంలో పాల్గొన్న సమాచార హక్కు చట్టం కమిషనర్ దేశాల భూపాల్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం బలమైనదన్నారు . ఈ చట్టం స్వీడన్ లో 1766వ సంవత్సరంలోనే ఏర్పాటైంది అని గుర్తు చేశారు. సమాచార హక్కు సాధన కార్యకర్తలు ప్రశ్నలు అడిగే సమయంలో ఎక్కువ ప్రశ్నలను ఒకేసారి అడగకుండా ....ఎక్కువ సంవత్సరాల వివరాలను అడగకుండా జాగ్రత్త పడాలన్నారు. ప్రజలకు సేవ చేసే భాగ్యాన్ని కల్పించిన ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు.

**ప్రజల పక్షాన పోరాడుతున్న సమాచార కార్యకర్తలకు అభినందనలు : కమిషనర్ మోహసిన్ ఫర్వీన్:**

సమాచార హక్కు సాధన కోసం కార్యకర్తలు పనిచేస్తున్న విధానం అభినందించదగ్గరిగా ఉందని సమాచార హక్కు చట్టం కమిషనర్ మోహసిన్ ఫర్వీన్ అన్నారు. పదిమందికి మేలు చేయాలని ఆలోచన, తపన ఉండడం అభినందించదగ్గ విషయం అన్నారు. చాలా హక్కు సాధన కమిటీ సభ్యులకు ఎల్లవేళలా తన సహకారాలు ఉంటాయన్నారు. సమాచార హక్కు చట్టం కమిషనర్ పివి శ్రీనివాస్ మాట్లాడుతూ, అధికారులు ప్రతి సమాచారానికి సమాధానం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో సమాచార హక్కు సాధన కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు సుర స్రవంతి, సినీ నిర్మాత డాక్టర్ ఎ కిరణ్ కుమార్, మల్లం వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం (మంత్రాలయం) మాన్య భూముల ఆక్రమణ

### తక్షణమే చర్యలు తీసుకోవాలని గ్రామ యువత డిమాండ్

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 6(ప్రభాత ఉదయం)**

మంత్రాలయంలో గల శ్రీ రాఘవేంద్ర స్వామి మఠానికి చెందిన అత్యంత విలువైన భూములు ఆక్రమణకు గురయ్యాయని మఠం భూములను కొందరు అక్రమార్కులు రాజకీయ అండదండలతో ఆక్రమించుకుని, సాగు చేయడమే కాకుండా శాశ్వత కట్టడాలు నిర్మిస్తున్నారని ఉలిగేపల్లి గ్రామస్తులు ఆరోపించారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా మల్దకల్ మండలం ఉలిగేల్లి గ్రామస్తులు సర్వే నంబర్ 15,16,24. 25 ,26.,27,28 ,145,146,148,178,197,198,201,202,258,259 లో గల శ్రీరాఘవేంద్ర స్వామి మఠం భూములు కబ్జాకు గురయ్యాయని, ఆలయ భూములను రక్షించాలంటూ జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామ యువత మాట్లాడుతూ... మంత్రాలయంలోగల శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం వారికి దశాబ్దాల క్రితం భక్తులు స్వామివారి కైంకర్యాల కోసం, అన్నదాన కార్యక్రమాల కోసం గద్వాల జిల్లాలో అనేక ఎకరాల భూములు ఉన్నాయని, అటువంటి పవిత్రమైన భూములను రికార్డులు తారుమారు చేసి అక్రమంగా అనుభవిస్తుండటం ధర్మ విరుద్ధమని గ్రామస్తులు పేర్కొన్నారు. మల్దకల్ మండలం ఉలిగేల్లి గ్రామ శివారులో గల సర్వే నెంబర్ 15,16,24,25, 26, 27, 28 ,145,146,148,178,197,198,201,202,258,259 లో గల మఠం భూములు కబ్జాకు గురయ్యాయని, సర్వే చేసి కాపాడాలని కోరారు. గతంలో శ్రీరాఘవేంద్ర స్వామి మఠం వారి ఆలయ భూములో గ్రామ పెద్దలు క్రీడా ప్రాంగణం, ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేసుకోవడం జరిగిందని, అట్టి ఖాళీ ప్రదేశాలను కూడా అక్రమార్కులు కబ్జా చేయడానికి యత్నిస్తున్నారని ఆరోపించారు. ఆలయ భూముల్లో హిందు స్మశాన వాటికకు కేటాయించగా అట్టి భూమిని కబ్జా చేసి సాగు చేస్తున్నారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి శ్రీరాఘవేంద్ర స్వామి మఠం భూములను కబ్జాకోరుల నుంచి పరిరక్షించాలని కోరినట్లు గ్రామస్తులు తెలిపారు.



## మెకానిక్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 6(ప్రభాత ఉదయం)**

అయిజ మండలం చిన్నతంద్రపాడు గ్రామానికి చెందిన టూ వీలర్ మెకానిక్ బోయ సత్యం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జిల్లా టూవీలర్ బైక్ మెకానిక్ సంఘం నాయకులు బాధిత కుటుంబసభ్యులను సోమవారం పరామర్శించి, మృతి చెందిన బోయ సత్యం కుటుంబానికి 33,000 రూపాయలను ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గడ్డమీది నాగిరెడ్డి మాట్లాడుతూ అనారోగ్యంతో బోయ సత్యం మృతి చెందడం దురదృష్టకరమని, ఆయన కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. జిల్లా అసోసియేషన్ ఆద్వర్యంలో బైక్ మెకానిక్ లు చేయూత నివ్వడం ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ రాజేందర్ రెడ్డి, గద్వాల టౌన్ అధ్యక్షుడు సుభాన్ ,ఇక్బాల్, మధు, హరీష్, షబ్బీర్ పాల్గొన్నారు.




## అమెరికన్ సామ్రాజ్యవాద దాడులను వ్యతిరేకిద్దాం

### ప్రపంచ శాంతి కోసం కృషి చేద్దాం

### భారత విదేశాంగ విధానానికి కట్టుబడి ఉందాం

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 6 ( ప్రభాత ఉదయం)**

అమెరికన్ సామ్రాజ వాద దాడులను ముక్తకంఠంగా వ్యతిరేకిద్దామని ప్రపంచ శాంతి కోసం జరిగే పోరాటంలో భారతదేశ ప్రజలు కూడా భాగస్వాములు కావాలని పక్ష పార్టీలో ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు పిలుపునిచ్చాయి. సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుండి పాత బస్టాండ్ లోని వైయస్సార్ చౌరస్తా వరకు యుద్ధ వ్యతిరేక శాంతి ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలో చమురు నిల్వ లపై ఆధిపత్యం కోసం అమెరికా చేస్తున్న వలసవాద సామ్రాజవాద దాడులను భారతదేశ ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. భారతదేశం కూడా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా వలసవాదానికి వ్యతిరేకంగా పోరాడిందని, భారత రాజ్యాంగంలో విదేశాంగ విధానంలో వలసవాద సామ్రాజ్యవాద దాడులకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలకు ఉద్యమాలకు అండగా ఉంటామని రాసుకున్నామన్నారు. విదేశాంగ విధానాన్ని అమలు చేయాల్సిన అవసరం, బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రపంచ యుద్ధాల వల్ల ఆర్థిక రాజకీయ సామాజిక వ్యవస్థలు కుప్పకూలుతున్నాయని, ఆకలి పేదరికం దారిద్రం పెరిగి ప్రపంచ వినాశనానికి కారణం అవుతున్నాయని తక్షణమే అమెరికా ఇరాన్ పై చేస్తున్న దాడులను ఆపాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకొని యుద్ధాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష పార్టీల నాయకులు నాగర్ దొడ్డి వెంకట్రాములు, న్యాయవాది మధుసూదన్ బాబు,ప్రభాకర్,ఏ. వెంకటస్వామి,కుర్వ పల్లయ్య, ఉప్పేర్ నరసింహ,వీవీ నరసింహ, మాల శ్రీనివాస్,వినోద్ ,హుస్సేన్, నర్మద, అరుణ, రవి,వాల్మీకి ,మోహన్,మాచర్ల ప్రకాష్ ప్రవీణ్,కార్తిక్, ఏసు రాజు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు తదితరులు పాల్గొన్నారు.



## కల్తీ లేని ఆహారంతో ఆరోగ్యం పదిలం

### అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 6(ప్రభాత ఉదయం)**

ఫుడ్ పాయిజన్ అయితే అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని, ప్రజలు కల్తీ లేని ఆహారాన్ని తీసుకుంటూ ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవాలని కలెక్టర్ నర్సింగరావు అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య వారోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో మొదటిరోజు సోమవారం ఫుడ్ సేఫ్టీ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. గద్వాల గాంధీ చౌక్ లోని పాత డిఎంహెచ్వో కార్యాలయం వద్ద అదనపు కలెక్టర్ జెండా ఊపి ఫుడ్ సేఫ్టీ కి సంబంధించిన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ...ప్రజలు ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను తీసుకోవాలని, ఇంట్లో కూడా ఎప్పటికప్పుడు వేడిగా వండుకొనిభుజించాలన్నారు. ఆహారాన్ని వండే ముందు చేతులను, పాత్రలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కృత్రిమ రంగులు ఉన్న ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలని, అవి కిడ్నీలను దెబ్బతీస్తాయని తెలిపారు. జిల్లాలో ఫుడ్ సేఫ్టీ అధికారులు హోటళ్లు, రెస్టారెంట్లలో నిరంతరం ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారని, వీరికి సంబంధిత ఇతర శాఖల అధికారులు అవసరమైన సహాయ సహకారాలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ సంధ్య కిరణ్మయి, ఫుడ్ ఇన్స్పెక్టర్ కరుణాకర్, ప్రోగ్రాం ఆఫీసర్ డా. రాజు, హెల్త్ ఎడ్యుకేటర్ మధుసూదన్ రెడ్డి, సీసీ వెంకటేష్, జిల్లా ఎన్సిడి ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్యాంసుందర్, సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.



## పోర్టల్ అప్ దోపిడిని అరికట్టాలి

### సీఐటీయూ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఏ.అశోక్

**కూకట్ పల్లి, ఏప్రిల్ 6 (ప్రభాత ఉదయం)**

కూకట్ పల్లి నియోజకవర్గం లోని వై జంక్షన్ లో ట్రాన్స్పోర్ట్ డ్రైవర్స్ ల ఆధ్వర్యంలో లో సీఐటీయూ పిలుపు లో భాగంగా పోర్టల్ అప్ దోపిడీ ని అరికట్టాలి సీఐటీయూ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఏ.అశోక్ అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వంద రూపాయలకు 19రూపాయలు దోచుకోవడం బాధాకరం అని, తెలంగాణ రాష్ట్రము లో పోర్టల్ అప్ ని బంద్ చెయ్యాలని కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అప్ ను ఏర్పాటు చెయ్యాలని కార్మికులను ఆదుకోవాలని అని మాట్లాడారు. కార్మికులు ఈఎంఐ లతో కార్మికులు ట్రాన్స్పోర్ట్ వెకిల్స్ కొనుకోని డీజిల్ ధరలు పెరుగుతుంటే జీవనం సాగడం మే కష్టం లా ఉంది అంటే మరో పక్క ప్రయివేటు స్కూల్ ల ఫీజులు లక్షలలో, వైద ఖర్చులు చెప్పలేనంత ఉంటున్నాయి. ఇన్ని కష్టాలు పడుతు వాహనాలు నడుపుతుంటే పోర్టల్ వాడు మమ్మల్ని నట్టేట దోపిడీ చేస్తున్నారు. కార్మికుల పక్షాన ఎర్ర జెండా సీఐటీయూ ఉంటుందని, పోరాటం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమం లో సీఐటీయూ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్, కార్మికులు కనకయ్య, శ్రీశైలం, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



## అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 6 (ప్రభాత ఉదయం)**

కేటిదొడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న ఒక ఇసుక టిప్పర్‌ను సోమవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా కేఏ 33ఏ 8616 నంబర్ గల టిప్పర్ కర్ణాటక రాష్ట్రం నుండి గంగన్ పల్లి గ్రామానికి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న క్రమంలో కేటిదొడ్డి గ్రామ శివారులో ఇసుక టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించారు. టిప్పర్ డ్రైవర్ పాతపాలెం చంద్రశేఖర్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నివరాణపై అవగాహన

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 6 (ప్రభాత ఉదయం)**



గద్వాలలోని మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్స్- ×ఎ వాలంటీర్స్ ప్రత్యేక వేసవి శిబిరంలో భాగంగా సోమవారం రేకుల పల్లె గ్రామంలో ఐదవ రోజు ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ ర్యాలీగా వెళ్లి ప్లాస్టిక్ నివారణ చర్యలను గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు.. ఇందులో భాగంగా ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ కప్పులు, ప్లాస్టిక్ స్పూన్లు, వాటర్ బాటిల్స్ ను నివారించడమే కాకుండా వాటికి బదులుగా జూటు సంచులు, గాజు లేదా స్టీల్ పాత్రలు, బట్ట సంచులు, మొదలైనవి ఉపయోగించి ప్లాస్టిక్ రహిత జీవనశైలిని ప్రోత్సహించాలని గ్రామస్తులకు తెలియజేశారు. అలాగే ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ ప్రభుత్వ స్కూల్ కు వెళ్లి వారు ఉపాధ్యాయులులై విద్యార్థులకు పాఠాలు బోధించినట్లుగా కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య షేక్ కలందర్ భాష తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్స్ -×ఎ ప్రోగ్రాం ఆఫీసర్ జి టి పద్మ , గ్రామ సర్పంచ్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ పాల్గొన్నారు.



## బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 6 (ప్రభాత ఉదయం)**

సోమవారం జిల్లా పోలీసు కార్యాలయం లో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో బాధితుల సమస్యల దిశగా, ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువాయే దిశగా పనిచేయాలని జిల్లా ఎస్పీటి. శ్రీనివాసరావు తెలిపారు.సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 15 ఫిర్యాదులు స్వీకరించారు.గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా వారి సమస్యలను మా దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.ప్రేమ పేరుతో మోసం చేశాడని - 01,భూవివాదాలకు సంబంధించి - 03, గొడవలకు సంబంధించి -04, డబ్బులు తీసుకుని ఇవ్వడం లేదని సంబంధించి -01, పొలం గేట్లకు గడ్డి మందు కొట్టడం - 01, ఇంటి స్థలం ఆక్రమణ చేశారని -01, భర్త హరాస్మెంట్ కు సంబంధించి - 02, ఇతర అంశాలకు సంబంధించి -02 ఫిర్యాదులు అందాయి.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608